## ఫిర్యాదు దారులకు న్యాయం జరిగేలా చూడాలి

- నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్లగొండ సిటీ: కనగల్ పోలీస్‌స్టేషన్ తనిఖీ చేస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ సిటీ/నాంపల్లి/మునుగోడు/గట్టుప్పల్/మర్రిగూడ, జూలై 10 : పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదు దారులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. కనగల్,నాంపల్లి, చండూరు, గట్టుప్పల్, మునుగోడు, మర్రిగూడ పోలీ సు స్టేషన్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. వసతుల గురించి స్థానిక సిబ్బందిని, కేసుల వివరాలను అడిగి తెలుకున్నారు. రికార్డులను పరిశీలించారు. నేరాల అదుపునకు పెట్రోలింగ్ పెంచాలన్నారు. గ్రామాల ప్రధాన కూడలిల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. అ సాంఘిక కార్యకలాపాలు జరుగకుండాగంజాయి, రేషన్ బియ్యం, జూదం లాంటి కార్యకలాలపాలపై నిఘా పెంచాలన్నారు. బ్లూకోర్ట్స్, పెట్రో మొబైల్ పోలీస్ సిబ్బంది అనుక్షణం ప్రజలకు అందుబాటులో ఉంటూ 100 డయల్ ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. కార్యక్రమాల్లో దేవరకొండ డీఎస్పీ గిరిధర్, నాంపల్లి సీఐ నవీన్ కుమార్, ఎస్ఐలు సురేశ్, రంగారెడ్డి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, లచ్చిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా జగన్నాథుడి రథయాత్ర



దేవరకొండ పట్టణంలో రథయాత్రలో పాల్గొన్న భక్తులు



చందంపేట(దేవరకొండ), జూలై 10 : ఇస్కాన్ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలో చేపట్టిన పూరి జగన్నాథ్ రథయాత్ర వైభవంగా బుధవారం సాగింది. దేవరకొండ పట్టణ పురవీధుల గుండా భక్తుల కోలాహలంగా కొనసాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల్లో ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథయాత్రలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, దేవేందర్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్లు జాలె నర్సింహారెడ్డి, వేణుధర్‌రెడ్డి, సురేశ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, పున్న వెంకటేశ్, పాల్గొన్నారు.

## వారం రోజుల్లో 689 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

- బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా
- సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

సూర్యాపేట సిటీ, జూలై 10 : పీడీఎస్ బియ్యంతో అక్రమ వ్యాపారం చేసే వారి నిల్వ స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నామని, వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా పది కేసులు నమోదు చేసి 689 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్ చేశామని సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో ఆ వివరాలు వెల్లడించారు. కేసు విచారణలో భాగంగా ఆంధ్రా ప్రాంతాల్లో కూడా దర్యాప్తు చేసి పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రభుత్వం ఒక మంచి ఉద్దేశంతో పేదల కోసం పీడీఎస్ బియ్యం అందిస్తున్నదని, వీటిని పక్కదారి పట్టించినా, రీ సైక్లింగ్ చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బియ్యం అక్రమ రవాణాను క్షేత్రస్థాయిలో అరికట్టడానికి సంబంధిత అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నామని, ప్రజా పంపిణీ వ్యవస్థకు బియ్యం అందించే మిల్లర్లు, అంతర్రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్స్‌పై పోలీసు నిఘా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరడానికి రేషన్ డీలర్లు, మిల్లర్లు బాధ్యతగా పని చేయాలని పేర్కొన్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారంపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, అంతర్రాష్ట్ర సరిహద్దులో ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు.

## కోదాడలో 100 అడుగుల జాతీయ జెండా

- నిర్మాణానికి భూమి పూజ చేసిన ప్రముఖులు



కోదాడలో వంద అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణకు భూమి పూజ నిర్వహిస్తున్న ఐవీఓ రాష్ట్ర కోఆర్డినేటర్ మధుసూదన్‌రావు, ప్రముఖులు

కోదాడ, జూలై 10 : కోదాడ పట్టణంలోని వాయిలసింగారం రోడ్డులో ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్(ఐవీఓ)కోదాడ ఆధ్వర్యంలో 100 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరించే నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. పట్టణ సీఐ రాము, పీసీసీ డెలికేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, మాజీ సైనిక అధికారి, ఐవీఓ స్టేట్ కోఆర్డినేటర్, జిల్లా అధ్యక్షుడు గుండా మధుసూదన్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నాడు దేశ రక్షణ కోసం సైన్యంలో పోరాడిన సైనికులు నేడు ఉద్యోగ విరమణ చేసి ఐవీఓ ద్వారా సమాజ శ్రేయస్సు కోసం కృషిచేయడం ప్రశంసనీయమని పట్టణ సీఐ రాము, పీసీసీ డెలికేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమాలతో యువతలో జాతీయ భావం కలుగుతుందని తెలిపారు. వంద అడుగుల జాతీయ జెండా నిర్మాణంతో కోదాడ పట్టణం ప్రత్యేక గుర్తింపు పొందుతుందని చెప్పారు. మాజీ సైనిక అధికారి మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఐవీఓ లక్ష్యం సమాజ సేవ అని, ఈ ఆర్గనైజేషన్‌లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ సైనికులతోపాటు పలువురు ప్రముఖులకు ఐవీఓ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం కార్గిల్ యుద్ధవీరుడు గోపయ్య జయంతి సందర్భంగా కోదాడలోని గోపయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐవీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఉజ్జిని రవీందర్‌రావు, కేరళ స్టేట్ అధ్యక్షుడు దివాకర్, సౌత్ జోన్ కో ఆర్డినేటర్ ప్రభాకర్‌రావు, ప్యాట్రాన్స్, జగని ప్రసాద్, ప్రగతి నాగేశ్వర్‌రావు, వీరనారి శారద, రమేశ్, లక్ష్మీకల్యాణి, వెంపటి ప్రసాద్, స్థల దాత కత్తి, భగత్, నాగుబండి రంగా తదితరులు పాల్గొన్నారు.

# బిల్లుల కోసం పాట్లు

## ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసిన సర్పంచ్‌ల పదవీకాలం

**పల్లె ప్రగతిలో చేసిన అభివృద్ధి పనులకు ఇంకా బిల్లులు ఇవ్వని ప్రభుత్వం**

**ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.130 కోట్ల బిల్లులు పెండింగ్**

**వడ్డీలు కట్టలేక పోతున్నామంటున్న మాజీ సర్పంచులు**

గ్రామాలను అన్ని రంగాల్లో తీర్చిదిద్ది పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం పల్లె ప్రగతి పథకాన్ని ప్రవేశపెట్టింది. పారిశుధ్యం నుంచి వైకుంఠధామాల వరకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టింది. అభివృద్ధి పనులకు మాజీ సర్పంచులు రూ.లక్షలు వెచ్చించారు. కానీ వాటి బిల్లులను వారి పదవీ కాలం ముగిసినా ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేస్తే ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడం వల్ల వడ్డీలు కట్టలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ వ్యాప్తంగా మాజీ సర్పంచులు సుమారు రూ.130 కోట్లు వెచ్చించి పనులు చేయగా ఆ బిల్లులు ప్రభుత్వ నుంచి రావాల్సి ఉన్నది.

– నల్లగొండ, జూలై 10




### పల్లె ప్రగతిలో పలు అభివృద్ధి పనులు

పల్లెలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 2019 సెప్టెంబర్ నుంచి పల్లె ప్రగతిని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా గ్రామంలో అన్ని సౌకర్యాలను కల్పించే దిశగా చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 1,740 గ్రామ పంచాయతీలకు రూ.46.50 కోట్లు ప్రతి నెలా విడుదల చేసింది. మొత్తంగా 51 నెలలపాటు ఈ నిధులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అయితే ఆలస్యంగా నిర్మాణం చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బిల్లులు ఇవ్వాల్సిన సమయంలో ఎన్నికలు రావడం, ఆ తర్వాత కాంగ్రెస్ అధికారం చేపట్టింది. ఈ క్రమంలో పెండింగ్ బిల్లులు ఇవ్వాల్సిన సర్కార్ అసలు పల్లె ప్రగతి పథకాన్ని పక్కన పెట్టేసి ఆ బిల్లులను పూర్తిగా విస్మరించింది. పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవనాలు, వైకుంఠ ధామం, డంపింగ్ యార్డ్, సెగ్రిగేషన్ షెడ్డు లాంటి అభివృద్ధి పనులను మాజీ సర్పంచులు పూర్తి చేశారు. వీటి కోసం ఒక్కో గ్రామంలో రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ఆ బిల్లులు కోసం మాజీ సర్పంచులు ఎదురుచూస్తున్నా ప్రభుత్వం కనికరించడం లేదు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఇప్పటికే పలువురు సర్పంచులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది.

### 1,740 గ్రామ పంచాయతీలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1,740 గ్రామ పంచాయతీలు ఉండగా సుమారు రూ.130 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తున్నది. ఏడాది క్రితం చేసిన వివిధ అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు బిల్లులు రాలేదు. నల్లగొండ జిల్లాలో సుమారు రూ.50 కోట్లు, సూర్యాపేటలో రూ.40 కోట్లు, యాదాద్రి భువనగిరిలో రూ. 30 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

### ఐదు నెలలైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయట్లేదు



గత ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతిలో మా గ్రామంలో అభివృద్ధికి లక్షలు వెచ్చించి పనులు చేశాం. పల్లె ప్రకృతి వనానికి నాలుగున్నర లక్షల రూపాయలు, పంచాయతీ బిల్డింగ్‌కు 20 లక్షలు, పారిశుధ్య పనులకు 3 లక్షలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు 10 లక్షల రూపాయలు ఖర్చు చేసినం. వాటికి సంబంధించిన బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయడం లేదు. మా పదవీ కాలం ముగిసి ఐదు నెలలు కావస్తున్నా బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. అభివృద్ధి పనులకు అప్పులు తెచ్చి మరీ చేశాం. ఇప్పటివరకు పెండింగ్ నిధులు రాకపోవడంతో వడ్డీలు కట్టలేక చితికి పోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ నిధులు విడుదల చేయాలి.

-గుండెబోయిన శ్రీలతాజంగయ్య యాదవ్, మాజీ సర్పంచ్, చెన్నుగూడెం, నల్లగొండ మండలం

## సజావుగా డీఈఈ సెట్

రామగిరి, జూలై 10 : రెండేండ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో ప్రవేశానికి నిర్వహించే డీఈఈ సెట్-2024 పరీక్ష బుధవారం ఆన్‌లైన్‌లో సజావుగా ముగిసింది. నల్లగొండలోని ఎస్పీఆర్ పాఠశాల ఆవరణలోని ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో ఉదయం 150మందికి 129మంది, మధ్యాహ్నం 150 మందికి 131మంది హాజరైనట్లు ఆ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నీలం రెడ్డి వెల్లడించారు. పీడబ్ల్యూడీ విద్యార్థులు ఉదయం ఏడు మందికి ఆరుగురు, మధ్యాహ్నం ఇద్దరికి ఇద్దరు హాజరయ్యారని తెలిపారు.

## గ్రామ పంచాయతీ ట్రాక్టర్ చోరీ

నార్కట్‌పల్లి, జూలై 10 :మండలంలోని ఏనుగుల దోరి గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పంచాయతీ సమీపంలోని నర్సరీ దగ్గర చెత్త సేకరించే ట్రాక్టర్ పార్కింగ్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ ఇంజిన్‌తో ఉన్న ట్రాలీని దొంగిలించారు. ఉదయాన్నే ట్రాక్టర్ కనిపించడంలేదని పంచాయతీ కార్యదర్శి గీతాంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అర్చకుల బదిలీలకు అడుగులు

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 279 మంది అర్చకులు, ఉద్యోగులు
- ఇప్పటికే ఈఓ, సిబ్బందికి స్థాన చలనం కల్పించేలా ప్రణాళికలు
- రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న దేవాదాయశాఖ



| జిల్లా | దేవాలయాలు | ఉద్యోగులు, అర్చకులు |
|---|---|---|
| నల్లగొండ | 25 | 106 |
| సూర్యాపేట | 27 | 93 |
| యాదాద్రి | 08 | 30 |
| జనగామ | 05 | 50 |
| మొత్తం | 65 | 279 |

రామగిరి, జూలై 10 : రాష్ట్ర వ్యాప్తంగా పలు శాఖల్లో ఉద్యోగుల బదిలీలు నిర్వహిస్తుండగా దేవాదాయ ధర్మాదాయ శాఖలోనూ ఆ దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ శాఖలోని ఈఓ, కార్యాలయ సిబ్బందికి స్థాన చలనం కల్పించేలా ప్రణాళికలు జరుగుతున్నాయి. అదే మాదిరిగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉద్యోగులు, అర్చకులకు వర్తింపజేయనున్నారు. బదిలీలకు సంబంధించి రాష్ట్ర శాఖ నుంచి ఉత్తర్వులు అందలేదని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.మహేందర్‌కుమార్ తెలిపారు.

### బదిలీ లేకుండా ఏండ్ల నుంచి..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రాంట్ ఇన్ ఎయిడ్ పరిధిలోని దేవాలయాల్లో సిబ్బంది, అర్చకులు కొందరు నియామకం జరిగినప్పటి నుంచి ఒకేచోట పనిచేస్తుండగా, మరికొందరు 15 నుంచి 20 ఏండ్లు నుంచి స్థానచలనం లేకుండా కొనసాగుతున్నారనేది వాస్తవం. దాంతో రాష్ట్ర దేవాదాయ శాఖ అర్చకులు, ఆలయ ఉద్యోగులను బదిలీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తున్నది.

### గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఆలయాలు ఇవే..

ఉమ్మడి నల్లగొండతోపాటు జనగామ జిల్లాలోని కొంత ప్రాంతంలో కలిపి ఉమ్మడి జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలో 65 గ్రాంట్ ఇన్ ఎయిడ్ దేవాలయాలు ఉండగా 279 మంది ఉద్యోగులు, అర్చకులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఏండ్ల తరబడి ఒకే చోట పనిచేస్తుండటంతో ఆలయాల నిర్వహణ సక్రమంగా సాగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బదిలీలు జరిగితే అంతా సవ్యంగా నడిచే అవకాశాలు ఉండనున్నట్లు తెలుస్తుంది. మరో వైపు గతంలో ఏమైనా అక్రమాలు జరిగితే అవి బయటకు వస్తాయని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు వెల్లడిస్తుండటం గమనార్హం.










# గ్యాస్ సబ్సిడీ గాయబ్

## మూణ్నాళ్ల ముచ్చటగానే మహాలక్ష్మి పథకం

- బ్యాంక్ ఖాతాల్లో జమ కాని డబ్బులు
- పార్లమెంట్ ఎన్నికల తర్వాత బంద్
- జిల్లాలో 90శాతం ఇదే పరిస్థితి
- సరైన ధ్రువపత్రాలు ఇచ్చినా అంతే..
- కేంద్రం సబ్సిడీ మాత్రమే జమ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



**కాంగ్రెస్ ప్రభుత్వం అట్టహాసంగా తీసుకొచ్చిన గ్యాస్ పథకం గాయబ్ అయ్యింది. మహాలక్ష్మి పథకం కింద గ్యాస్ సబ్సిడీ మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నది. జిల్లాలో 90శాతం మందికి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కేంద్రం ఇచ్చే సబ్సిడీ మాత్రం సకాలంలో అందుతున్నది.**

– యాదాద్రి భువనగిరి, జూలై 10 (నమస్తే తెలంగాణ)

అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించింది. దీనిలో రూ. 500కే సబ్సిడీ గ్యాస్‌ను తీసుకొచ్చింది. అయితే వినియోగదారులు ముందుగా పూర్తిగా డబ్బులు చెల్లించి గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవాలి. ఆ తర్వాతే ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా గ్యాస్ సబ్సిడీకి లబ్ధిదారులను ఎంపిక చేశారు. జిల్లాలో ప్రజాపాలనలో గ్యాస్ సబ్సిడీ కోసం 2.30లక్షల దరఖాస్తులు వచ్చాయి. తెల్ల రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకున్నారు. కానీ జిల్లాలో ఎంత మంది లబ్ధిదారులు ఉన్నారో పౌర సరఫరా అధికారులకే తెలియకపోవడం గమనార్హం.

### 90శాతం మందికి నో సబ్సిడీ..!

ప్రస్తుతం ఎల్పీజీ డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 855 ఉంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం సుమారుగా రూ. 315, కేంద్రం రూ. 40.71 సబ్సిడీ ఇస్తున్నది. దాంతో లబ్ధిదారుడికి రూ. 500కే గ్యాస్ అందుతుంది. పథకం ప్రారంభమైన మొదట్లో సబ్సిడీ డబ్బులు ఖాతాల్లో సరిగ్గానే జమ అయ్యాయి. కానీ పార్లమెంట్ ఎన్నికల తర్వాత మాత్రం డబ్బులు జమ కావడంలేదని లబ్ధిదారులు చెబుతున్నారు. జిల్లాలో 90శాతం మందికి డబ్బులు పడటంలేదని, 10శాతం మందికే జమ అవుతున్నట్లు తెలుస్తున్నది. కొంత మంది నెల రోజులుగా డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ మాత్రం ఎప్పటికప్పుడు జమ అవుతున్నది.

### వివరాలు అందించినా అంతే..

మహాలక్ష్మి పథకం కింద అర్హుల ఎంపిక కోసం ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులు స్వీకరించింది. సబ్సిడీ సిలిండర్ కోసం భారీగా దరఖాస్తులు రాగా, వీటిని ఆన్‌లైన్ చేశారు. ఆ సమయంలో వివరాలు సరిగా ఎంటర్ చేయకపోవడం, గ్యాస్ కనెక్షన్, ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు సరిగా ఇవ్వకపోవడంతో చాలా మంది ఈ పథకం కింద లబ్ధి పొందలేకపోయారు. దీన్ని గుర్తించిన సర్కారు వివరాలు సరిచేసుకునేందుకు ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో స్పెషల్ కౌంటర్లను ఏర్పాటు చేసింది. లబ్ధిదారులు సరైన ధ్రువ పత్రాలు అందించినా డబ్బులు జమ కావడంలేదు.

### ప్రజాపాలన దరఖాస్తులు మళ్లీ ఎప్పుడో..?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో డిసెంబర్ 28న ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జనవరి 6వరకు దరఖాస్తులను స్వీకరించారు. అప్పటి నుంచి ప్రజాపాలన వెబ్‌సైట్‌ను నిలిపేశారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతి నాలుగు నెలలకోసారి నిర్వహిస్తామని సర్కారు గతంలోనే ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు మళ్లీ ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించలేదు. జూలై నెల గడుస్తున్నా ఆ ముచ్చటే ఎత్తడంలేదు.



### రెండు నెలలే డబ్బులు వేసిర్రు..



పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు పడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీకి సంబంధించిన రెండు నెలల డబ్బులు జమ చేసింది. ఎన్నికల అనంతరం ఆ డబ్బులను వేయడం లేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తున్నది. మహిళలకు గ్యాస్ బండ భారం లేకుండా చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేస్తున్నది.

-బొలగాని నాగమణి, గృహిణి, మోటకొండూర్

### రూ. 40 సబ్సిడీ మాత్రమే పడుతున్నాయి



కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా 500కి గ్యాస్ సిలిండర్ ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించి మోసం చేసింది. 500 కే సిలిండర్ వస్తుందని ఎంతో సంతోష పడ్డాం కానీ ఆ సంతోషం ఆవిరైపోయింది. సీఎం రేవంత్ రెడ్డి ఎక్కడ మీటింగ్ పెట్టినా 500 కే సిలిండర్ ఇస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ ఇప్పటి వరకు అది అమలు కావడం లేదు. గ్యాస్ ఏజెన్సీకి పోతే 855 రూపాయలు తీసుకుంటున్నారు. బ్యాంకులో కేవలం 40 రూపాయలు మాత్రమే సబ్సిడీ పడుతున్నాయి. మాట ఇచ్చి ఈ ప్రభుత్వం మోసం చేసింది.

- మేకల మంజుల, గృహిణి మల్కాపురం

### రెండు సార్లు సిలిండర్ తీసుకున్నా పైసలు పడలే



తక్కువకే గ్యాస్ ఇస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పిడంతో దరఖాస్తు చేసినం. రెండు సార్లు గ్యాస్ అయిపోతే పాత ధర కాడికే గ్యాస్ తెచ్చుకున్నా. అగ్గువకే గ్యాస్ ఇస్తమంటిరి గదనయ్యా అని గ్యాస్ బండోళ్లను అడిగితే డబ్బులు వాపసు నీ ఖాతాలో బ్యాంకులో జమైతయని చెప్పిర్రు. రెండు సార్ల గ్యాస్ నింపించుకున్నా డప్పులు రాలే. బ్యాంకోళ్లను అడిగితే ఇంకా రాలేదని గ్యాసోళ్లను అడగమని పంపించిర్రు. వాళ్లను అడిగితే సర్కారోళ్లు వేస్తలేరని చెప్పిండ్రు. ఎవరిని అడుగాలో సమజైతలేదు.

- మాదోతు అంబాలి, పుట్టిగూడెం, రాజాపేట మండలం

### అప్‌డేట్ చేసినా సబ్సిడీ పడుత లేదు



సబ్సిడీ గ్యాస్ కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నా ఇప్పటివరకు సబ్సిడీ పడలేదు. నెల రోజుల క్రితం కూడా ఎంపీడీఓ కార్యాలయంలో అప్డేట్ చేసుకున్నాం. అయినా సబ్సిడీ డబ్బులు బ్యాంకు ఖాతాలో పడలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు రూ. 500కే గ్యాస్ అందిస్తామని చెపితే ఎంతో మురిసిపోయాం. కానీ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇచ్చిన మాట తప్పిండ్రు. నేటి వరకు సబ్సిడీ పడకపోవడంతో నిరాశతో ఉన్నాం.

- లోడి రోహిణి ఆత్మకూరు.ఎం